క్లుప్తంగా

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు



గౌరీపరమేశ్వరులను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: ప్రకాష్‌నగర్ గౌరీపరమేశ్వదేవి ఆలయంలో స్థానిక గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గౌరీపరమేశ్వరులను ఎమ్మెల్యే పి.గణబాబు దర్శించుకుని పూజలు చేశారు. నెల రోజుల పాటు ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా కార్తీక మాసం ముందు దేవతామూర్తుల పూజలను స్థానిక ప్రజలు ఆచరిస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగా గౌరీపరమేశ్వరులకు పూజలు జరుపుతున్నారు.

స్కాలర్‌షిప్ అవార్డుల ప్రదానం రేపు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్ కేటీబీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ప్రతిభ గల విద్యార్థులకు స్కాలర్‌షిప్ అవార్డులు ఇవ్వనున్నట్లు కేటీబీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షులు బత్తుల చిరంజీవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాకానినగర్ కేటీబీ అసోసియేషన్ కార్యాలయంలో ఈ నెల 3వ తేదీ ఆదివారం ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. 2023–24 సంవత్సరంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు వీటిని అందజేస్తామన్నారు. అసోసియేషన్ సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

పటేల్ ఆశయ సాధనకు కృషి



వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటం వద్ద కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, రెవెన్యూ అధికారి బి.హెచ్.భవానీ శంకర్, ఏవో ఈశ్వరరావు, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది ఘన నివాళులర్పించారు. అనంతరం అధికారులు, సిబ్బంది చేత కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. పటేల్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం



గోవిందరావు దంపతులను సత్కరిస్తున్న అధికారులు

మల్కాపురం: మల్కాపురం మంచినీటి సరఫరా కార్యాలయంలో లైన్‌మన్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన గోవిందరావును అధికారులు, సిబ్బంది ఆత్మీయంగా సత్కరించారు. కార్యాలయంలో గురువారం గోవిందరావు దంపతులకు వాటర్ సప్లై ఏఈ బద్రీనాథ్, ఇతర అధికారులు, సిబ్బంది శాలువా కప్పి, పూలమాలలు వేసి జ్ఞాపిక అందజేశారు. నీటి సరఫరా విభాగంలో ఆయన అందించిన సేవలను వారంతా కొనియాడి ఘనంగా వీడ్కోలు పలికారు.

శివ పూజకు వేళాయె..

నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు ● ముస్తాబైన శివాలయాలు



కార్తీక మాసోత్సవాలకు సిద్ధమైన మర్రిపాలెం వుడా లే అవుట్‌లోని వినాయక ఆలయం

విశాఖ విద్య: పరమ శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసం శనివారం నుంచి ప్రారంభం కానుంది. శివ భక్తులు నియమనిష్టలతో పూజలు చేసి స్వామి అనుగ్రహం పొందేందుకు సిద్ధమయ్యారు. నియోజకవర్గంలోని శివాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. నెల రోజుల పాటు శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ప్రతి సోమవారం శివాలయాలకు భక్తులు పోటెత్తే అవకాశం ఉండటంతో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

వైభవంగా ఆకాశ దీపోత్సవం

కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం అన్ని ఆలయాలపై ఆకాశ దీపం వెలిగించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని ఎన్‌ఏడీ సెంటర్‌లో ఆధ్యాత్మిక పీఠంగా విరాజిల్లుతోన్న ప్రమథ ఉమా విశ్వేశ్వర కుమారస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 90వ వార్డు సుసర్ల కాలనీ, సీతారామరాజునగర్‌లోని



సుసర్ల కాలనీలో ఉత్సవాలకు సిద్ధమైన చంద్రమౌళీశ్వర ఆలయం

పార్వతీ చంద్రమౌళీశ్వర ఆలయంలో ఆకాశ దీపోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర ఇచ్చారపు, మందపాటి శ్రీనివాజరాజు, ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు. బుచ్చిరాజుపాలెం గవరవీధి రామాలయం వద్ద శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వర మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.

గోపాలపట్నంలో సర్వం సిద్ధం

గోపాలపట్నం చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, 89వ వార్డు కొత్తపాలెంలోని సంతోష్‌నగర్, నాగేంద్ర కాలనీ శివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 91వ వార్డు బాజీ జంక్షన్ రామాలయం, శివాలయాల్లో జరిగే వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నీటిలో దీపాలను వెలిగించేందుకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు.

ఎన్‌ఏడీలో మహిమ గల విశ్వేశ్వరుడు

ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ వద్ద దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రమథ ఉమా విశ్వేశ్వర కుమార స్వామి మహిమగల దేవుడుగా భక్తులు అభివర్ణిస్తున్నారు. 1974లో ఇక్కడ ప్రమథ విశ్వేశ్వర స్వామి స్వయంభూగా వెలిశారని భక్తుల ప్రగాఢ నమ్మకం. నాటి నుంచి ఆలయంలో నిత్య పూజలు చేస్తున్నారు. ప్రతి సోమవారం స్వామి వారికి నిర్వహించే పూజాది కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ నిర్మాణం సమయంలో ఇది కొంతమేర అడ్డంగా ఉన్నప్పటికీ, మహిమ గల దేవుడు కావడంతో దీన్ని తొలగించ



బుచ్చిరాజుపాలెం గవరవీధిలో కొలువైన గౌరీ పరమేశ్వరులు



చంద్రమౌళీశ్వర స్వామి



ఎన్‌ఏడీలో ముస్తాబైన ప్రమథ ఉమా విశ్వేశ్వర కుమార స్వామి ఆలయం

డానికి వీల్లేదని పరిసర కాలనీల వాసులు పట్టుబట్టారు. దీంతో ఫ్లై ఓవర్ చుట్టూ నిర్మాణాలు తొలగించినా.. ప్రమథ ఉమా విశ్వేశ్వర కుమార స్వామి వారి ఆలయాన్ని యథావిధిగా ఉంచి నిత్య పూజలు చేస్తున్నారు. కార్తీక మాసంలో మరింత శోభాయమానంగా పూజాది క్రతువులు నిర్వహించేందుకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

పౌర్ణమి పూజలతో పరవశించేలా..

కార్తీక మాసంలో ప్రతి సోమవారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. కార్తీక సోమవారం రోజున శివయ్యను కనులారా దర్శించి తరించేందుకు శివ భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలను దర్శించుకుంటారు. ఈ నెల 15వ తేదీ శుక్రవారం కార్తీక పౌర్ణమి రోజున శివాలయాల్లో అభిషేకం, జ్వాలా తోరణం వేడుకలను అంబరాన్ని తాకేలా నిర్వహించేందుకు ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి.

పింఛన్‌దారుల పాట్లు



62వ వార్డులో పింఛన్ కోసం గుమిగూడిన వృద్ధులు



కంచరపాలెం జాతీయ రహదారి సబ్‌వేలో గట్లపై పింఛన్ కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు

సింధియా: రాష్ట్రం ప్రభుత్వం పంపిణీ చేసే సామాజిక పింఛన్ల సొమ్ము అందుకునేందుకు వృద్ధులు నానా పాట్లు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం తీరు కారణంగా పారిశ్రామిక ప్రాంతంలోని పింఛన్‌దారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం పింఛన్ నగదు ఇవ్వాల్సి ఉండగా.. సిబ్బంది సమయానికి రాకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం దీపావళి పండగ రోజున ఇతర ప్రాంతాలకు వెళ్లిన పింఛన్‌దారులు సైతం మారుమూల గ్రామాల నుంచి ఆటోలు, ఇతర రవాణా సౌకర్యాల ద్వారా తమ నివాస ప్రాంతాలకు చేరుకుని పెన్షన్ సొమ్ము కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరంగా ఉంచడంతో సరిపడా సిబ్బంది లేక నగదు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం తలెత్తింది. 62వ వార్డులో పింఛన్ కోసం క్యూ లైన్లలో వేచి ఉన్న వృద్ధులు ఆకలి, దప్పికతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొంతమంది సమీపంలోని చెట్ల నీడన కూర్చొనగా, కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయలేని దుస్థితి నెలకొందని పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేశారు.

సర్వర్ మొరాయింపు.. వృద్ధుల నిరీక్షణ

కంచరపాలెం: సామాజిక పింఛన్ల పంపిణీలో సర్వర్లు మొరాయించడంతో జోన్-5 పరిధిలో లబ్ధిదారులకు నిరీక్షణ తప్పలేదు. పింఛన్ల పంపిణీ కోసం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లిన సచివాలయ సిబ్బంది సర్వర్లు పని చేయకపోవడంతో, వారిని సచివాలయాల వద్దకు రమ్మని పిలిచారు. అక్కడ కూడా సరిగ్గా పనిచేయకపోవడంతో సుమారు గంట సమయం వేచి ఉండాల్సి వచ్చింది. మరికొన్ని ప్రాంతాల్లో ప్రతి నెలా మాదిరిగానే లబ్ధిదారులను ఒకచోట చేర్చి పంపిణీ చేస్తున్నారని పలువురు అవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వరకు సక్రమంగా పనిచేయని సర్వర్లతో సిబ్బంది విసుగు చెందారు. పింఛన్ల కోసం లబ్ధిదారులు కంచరపాలెం జాతీయ రహదారిలో సబ్‌వే దిమ్మెలపై కూర్చొని నిరీక్షించారు. జోన్-5 పరిధిలో 24వార్డులకు సంబంధించి టీపీఆర్‌వో ఏపీడీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీల ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేసినట్లు జెడ్సీ బి.రాము తెలిపారు. మొత్తం 31,876 మందికి గాను 29,400 మందికి పింఛన్ అందజేశారన్నారు. సుమారు 92.18 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందన్నారు. శనివారం నాటికి 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీవోలు పుణ్యవతి, కృపానందం, జోనల్ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో అగ్నిప్రమాదం

విశాఖ విద్య: జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్‌లోని జనసేన వార్డు కార్యాలయంలో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించి దగ్ధమైంది. ఉదయం 9.30 గంటల సమయంలో భవనంలోనుంచి దట్టమైన పొగలు రావడాన్ని గుర్తించిన ఇరుగుపొరుగు ఇళ్ల వారు, విషయాన్ని జనసేన పార్టీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. వారంతా అక్కడికి చేరుకొని మంటలను అదుపుచేశారు. వార్డు కార్యాలయం తరచూ మూసే ఉంటుందని చుట్టుపక్కల వారు చెబుతున్నారు. దీంతో అగ్నిప్రమాదం ఎలా జరిగిందనే దానిపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నా.. ఆ సమయంలో ఇందిరానగర్‌లో మెయింటెన్స్ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేశామని ట్రాన్స్ కో అధికారులు చెబుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గణబాబు అక్కడికి చేరుకొని పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు.

'సెయింట్ జోసెఫ్'లో విజిలెన్స్ వారోత్సవాలు



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు, కళాశాల సిబ్బంది తదితరులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ భగవాన్ మాట్లాడారు. అవినీతి వ్యతిరేక సందేశాలు ప్రజలకు చేరేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించి, అప్రమత్తంగా ఉండటం ద్వారా సుసంపన్న భారత్ సాధించవచ్చన్నారు. ఆన్‌లైన్ పద్ధతులను విస్తృతంగా వాడుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులతో విజిలెన్స్ అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, హెచ్‌ఆర్ మేనేజర్ జి.భారతి, డాక్టర్ పి.కె. జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

రహదారి ఆక్రమణతో ఇబ్బందులు



సుసర్ల కాలనీ రహదారిపై పేర్చి వదిలేసిన ఇటుకలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు సుసర్ల కాలనీ ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాల పక్కనున్న రహదారిని ఓ బిల్డర్ ఆక్రమించేశాడు. భవన నిర్మాణం కోసమని రోడ్డుపైనే ఇటుకలను పేర్చి రోజుల తరబడి అలానే వదిలేశాడు. డ్రైనేజీని మూసివేసి, రోడ్డును సగం వరకు ఆక్రమించి ఇటుకలను పెట్టడంతో అటుగా వెళ్లే వాహన చోదకులకు, పాదచారులకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. రహదారిలో ఇలా ఇటుక కుప్పలు వేసి వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నామని, సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

సాయి మందిరంలో ఆకాశ దీపారాధన



ఆకాశ దీపం వెలిగిస్తున్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్‌ఈబీ కాలనీలోని షిర్డీసాయి ధ్యాన మందిరంలో కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం రాత్రి ఆకాశ దీపం వెలిగించారు. అర్చకులు ముందుగా బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోలాహలం నడుమ ఆలయ ప్రాంగణంలో ఆకాశ దీపాలన్ని వెలిగించి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయంలో కార్తీక మాసోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్లా సత్యనారాయణ రావు తెలిపారు.

కేజీహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స



రోగితో కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఒక పేద మహిళకు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ప్రేమ జీత్ రే ఆధ్వర్యంలో వైద్యులు చికిత్స చేయడంతో రోగి సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖకు చెందిన 42 సంవత్సరాల పి.లక్ష్మి అనే మహిళ తలనొప్పి, వాంతులతో బాధపడుతూ గత నెల 14న కేజీహెచ్ న్యూరో ఓపీలో చూపించుకుంది. ప్రాథమిక పరీక్షలు చేసి న్యూరో సర్జరీ వార్డులో చేర్చారు. ఆమెకు ట్యూమర్ ఉన్నట్లు తేలింది. గతంలో కూడా ఈమెకు ఇదే సమస్య రావడంతో 2021లో కేజీహెచ్‌లో ఆపరేషన్ చేశారు. అప్పుడు కొంత భాగమే తొలగించారు. మరొక సారి శస్త్ర చికిత్సలో పూర్తిగా తొలగిస్తామని అప్పట్లో వైద్యులు చెప్పారు. ఈ ట్యూమర్ పెరిగి ఇప్పుడు పెద్దదై బ్రెయిన్‌లో 3వ వంతు పెరిగింది. ఇది క్యాన్సర్ కాదని, బ్రెయిన్ ట్యూమర్ అని వైద్యులు వివరించారు. గత నెల 22న శస్త్ర చికిత్స చేసి ట్యూమర్‌ను పూర్తిగా తొలగించారు. న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఎం.ప్రేమ జీత్ రే ఆధ్వర్యంలో ఎనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ వాసుపల్లి రవి పర్యవేక్షణలో 8 గంటల పాటు శస్త్ర చికిత్స చేసి పూర్తిగా తొలగించారు. శుక్రవారం రోగిని సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద పరామర్శించారు.

వెలుగులు నింపిన దీపావళి



వినాయకుడి విగ్రహం వద్ద దీపాలతో అలంకరణ



కుటుంబ సమేతంగా దీపావళి జరుపుకుంటున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



మర్రిపాలెం వుడా లేఅవుట్ వినాయక ఆలయంలో సామూహిక దీపారాధన


విశాఖ విద్య: దీపావళి పండగను గురువారం నియోజకవర్గ ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటా దీపాల కాంతులు విరజిమ్మాయి. పిల్లల నుంచి పెద్దల వరకు బాణసంచా కాల్చేందుకు ఎంతో ఆసక్తి చూపారు. ఇళ్లలో లక్ష్మీ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నోము నోచినవారు సాయంత్రం చెరుకుగడలకు దీపాలను వెలిగించి, మళ్లీ రావే దీపావళి అంటూ పాటలు పాడుతూ ఆనందోత్సవంగా గడిపారు. 52వ వార్డులో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కుటుంబ సమేతంగా దీపావళి వేడుకలో పాల్గొని దీపాలు వెలిగించారు. మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని వినాయక ఆలయంలో సామూహిక దీపారాధన చేశారు.

పారిశ్రామిక వాడలో సందడి

మల్కాపురం: దీపావళి వేడుకలను పారిశ్రామిక ప్రాంత వాసులు సందడిగా జరుపుకున్నారు. సంప్రదాయ వస్త్రాలు ధరించి ఇళ్లను అలంకరించి, పూజలు చేశారు. బాణసంచా కాల్చి సరదాగా గడిపారు. ప్రకాష్‌నగర్‌లో స్ఫూర్తి టీమ్ ఆధ్వర్యంలో యువత దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇక్కడి మైదానం వద్ద యువత మత్తు పదార్థాలను విడనాడాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని లెటరింగ్ రాసిన బాణసంచా చక్రాన్ని పదడుగుల ఎత్తులో ఉంచి దానికి నిప్పు పెట్టి వెలిగించారు. ఆ చక్రం దహనమైనట్లే యువత మనసులోని చెడు పోవాలని నిర్వాహకులు దీనిని వెలిగించి సందేశమిచ్చారు.



బుచ్చిరాజుపాలెం స్కూల్‌లో దీపావళి వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థులు



బాణసంచా ఫ్లెక్సీ



యువత మత్తుపదార్థాలు విడనాడాలంటూ.. ప్రకాష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా ఫ్లెక్సీ కాలుతున్న దృశ్యం

యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు



62వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో వ్యర్థాలు తొలగిస్తున్న జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో ఇటీవల కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు విస్తృతంగా పర్యటించిన సంగతి తెలిసిందే. యూజీడీ, శానిటేషన్ సమస్యలపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడారు. యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు చేయించి సమస్యలను పరిష్కరించారు. పారిశుధ్య పనులు నిరంతరం జరుగుతాయని, వ్యర్థాలు డ్రైనేజీల్లో వేసే వారిపై చర్యలు తీసుకుంటామని, ఇంట్లోని వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని కార్పొరేటర్ లక్ష్మణరావు సూచించారు. భవిష్యత్తులో అనేక మౌలిక సదుపాయాలను ప్రజలకు అందించేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. పారిశుధ్య సమస్యలను త్వరితగతిన పరిష్కరించిన కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావుకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

పంచగ్రామాల భూ సమస్య పరిష్కరించాలి

విశాఖ విద్య: సింహాచలం పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరించాలని సీపీఎం జోన్ కార్యదర్శి బి.జగన్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు బహిరంగ లేఖ పంపించినట్లు ఆయన తెలిపారు. 25 ఏళ్లుగా పంచగ్రామాల భూ సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు దీనిపై తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

దీపావళి వేళ.. ఎన్‌ఏడీ ఖాళీ

విశాఖ విద్య: దీపావళి పండగ రోజు ఎన్‌ఏడీ ఏరియాలో రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. పండగకు దూరప్రాంతాలకు వెళ్లే వారంతా ముందు రోజే పయనమవడంతో దీపావళి నాడు రోడ్లపై వాహనాల రాకపోకలు సైతం కనిపించలేదు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఎన్‌ఏడీ ఆర్టీసీ బస్‌స్టాప్ గురువారం బోసిపోయింది. బస్‌స్టాప్ ఖాళీగా ఉండటంతో అక్కడ ఆర్టీసీ బస్సును నిలిపి, మరమ్మతులు చేసుకున్నారు.



ఖాళీగా కనిపిస్తున్న ఎన్‌ఏడీ బస్‌స్టాప్



మరమ్మతుల కోసం నిలిపిన ఆర్టీసీ బస్